సాక్షి ప్రకాశం

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



ఉచితం మాటున ఊదేస్తున్నారు

పొన్నలూరు మండల పరిధిలోని పాలేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ తెలుగు తమ్ముళ్లు జేబులు నింపుకుంటున్నారు. - 8లో..



ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
31.5/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి అండర్ 15 చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్ర స్థాయి అండర్ చెస్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు బాలురు, నలుగురు బాలికలు ఎంపికయ్యారని ప్రకాశం జిల్లా చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ నబీ తెలిపారు. స్థానిక హైదరీక్లబ్‌లో ఆదివారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. బాలుర విభాగం లో సాయితనిష్, షఫీజ్, విష్ణుగుప్తా, అర్హాన్‌లు ఎంపిక కాగా, బాలికల విభాగంలో సునయన, పాన్యశ్రీవల్లి, విజ్ఞశ్రీ, వెంకట మేఘనరెడ్డి అర్హత సాధించారు. వీరు ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో జరిగే అండర్ 15 చెస్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని టోర్నమెంట్ ఆర్బిటర్ సుకాంత్ వివరించారు.

అటవీశాఖలో అధికారుల బదిలీలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ పరిధిలోని రేంజి ఆఫీసర్లు బదిలీలయ్యారు. గుండ్లకమ్మ రేంజర్‌గా పనిచేస్తున్న జీవన్‌కుమార్ దోర్నాల రేంజర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యర్రగొండపాలెం రేంజర్ నీలకంఠేశ్వరరెడ్డిని నియమించడంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. గిద్దలూరు రేంజి ఆఫీసరుగా ఉన్న కుమార్‌రాజాను ఉదయగిరికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో మార్కాపురం డివిజన్‌లో రేంజి ఆఫీసరుగా పనిచేస్తున్న సత్యనారాయణరెడ్డిని నియమించడంతో నూతనంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. స్క్వాడ్ రేంజి ఆఫీసర్‌గా పనిచేస్తున్న సౌజన్య నేపట్టు రేంజర్‌గా బదిలీ అయ్యారు.

కర్రసాములో జిల్లా విద్యార్థినికి బ్లాక్‌బెల్ట్



సర్టిఫికెట్ అందుకుంటున్న జయశ్రీరెడ్డి

ఒంగోలు: కర్రసాము (సిలంభం)లో జిల్లా విద్యార్థిని మాస్టర్ జయశ్రీరెడ్డి బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకుంది. ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు తమిళనాడులోని వెల్లూరు జిల్లా షుగర్ మిల్ గ్రౌండులో సిలంభం ట్రైనింగ్ క్యాంపు, కోచ్ ట్రైనింగ్ జరిగింది. ఈ క్యాంపులో ఒంగోలు వాసి టి.జయశ్రీరెడ్డి సిలంభంలో వీరపాండ్య కట్ట బొమ్మలో మాస్టర్ డిగ్రీ బ్లాక్ బెల్ట్‌ను కైవసం చేసుకుని ఇంటర్నేషనల్ సిలంభం మాస్టర్ పి.సంతోష్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. సిలంభంలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకున్న జయశ్రీరెడ్డిని ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సిలంభం ఫెడరేషన్ అధ్యక్షుడు మాస్టర్ పి.సంతోష్‌కుమార్, జాతీయ సిలంభం టెక్నికల్ డైరెక్టర్ మాస్టర్ పి.అశ్విన్, తమిళనాడు సిలంభం ప్రధాన కార్యదర్శి వి.అరుణ్, తమిళనాడు టెక్నికల్ డైరెక్టర్ , ఎగ్జామినర్ ఎస్ఎస్ మోహన సుందరం, ఏపీ సిలంభం అధ్యక్షుడు కె.రఘునాథరెడ్డి, కార్యదర్శి మాస్టర్ టి.శ్రీనివాసరెడ్డి, సభ్యులు జయశ్రీరెడ్డికి అభినందనలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం

- మాల జేఏసీ చైర్మన్ దేవి ప్రసాద్



మాట్లాడుతున్న మాల జేఏసీ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం అని మాల జేఏసీ చైర్మన్ దేవి ప్రసాద్ అన్నారు. ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే సుప్రీం కోర్టు వర్గీకరణ అవసరంలేదని, ఒక వేళ అవసరం అయినా అది పార్లమెంటులో బిల్లు పెట్టాలని సూచించిందన్నారు. దేశంలో దళితులు ఐక్యంగా ఉండటం ఓర్చుకోలేని కొన్ని రాజకీయ పార్టీలు అన్నతమ్ముళ్లుగా ఉంటున్న దళితులను విడగొట్టేందుకు కుట్రలు పన్నాయన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవం నాడు గుంటూరులో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితులకు రిజర్వేషన్ ఫలాలు పూర్తి స్థాయిలో అందకుండా దూరం చేయడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణతో పాటు అడగకుండానే ఎస్టీ వర్గీకరణ చేసిందన్నారు. క్రిమిలేయర్ మోదీ కుట్రనే అని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అశోక్‌బాబు, మల్లేశ్వరి, శ్రీరాములు, గోపీనాథ్, శాంతారావు పాల్గొన్నారు.

శత్రు సంహారిణి.. విజయ రూపిణీ



పార్వేటలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులు

శత్రు పీడను తొలగించి విజయాలను చేకూర్చాలని ఆ శక్తి రూపిణిని ప్రార్థిస్తూ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విజయదశమి పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఒంగోలు నగరంలో శనివారం సాయంత్రం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో నగరంలో వీధులు కిక్కిరిశాయి. వివిధ ఆలయాల నుంచి వచ్చిన ఉత్సవమూర్తులను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. జమ్మిచెట్టు వద్ద శమీపూజ చేశారు. - సాక్షి, ఒంగోలు



ఒంగోలు నగరంలో దసరా పార్వేటలో ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు





ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీరోడ్డులో నిర్వహించిన పార్వేట ఉత్సవంలో అమ్మవారి మూర్తులకు విశేష నైవేద్యాలు, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు




పార్వేటలో ఊరేగింపుగా వస్తున్న ఉత్సవమూర్తులు

లిక్కర్ లాటరీ

మరో ఒకటి రెండు రోజుల్లో ప్రైవేటు మద్యం దుకాణాల హడావుడి మొదలు కానుంది. ఊరువాడా తేడా లేకుండా మద్యం దుకాణాలు వెలియనున్నాయి. ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేసుకునే వెసులుబాటుతో పాటుగా ఎన్ని దుకాణాలు కావాలంటే అన్ని ఏర్పాటు చేసుకునే బంపర్ ఆఫర్ ఇచ్చిన ప్రభుత్వం రెట్టించిన ఉత్సాహంతో మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయనుంది.

- ప్రజల ఆదాయానికి మద్యం చిల్లు
- ఊరువాడ మద్యం దుకాణాలకు శ్రీకారం
- 171 మద్యం దుకాణాలకు నేడు డ్రా
- సాయంత్రానికి దుకాణాల కేటాయింపు
- రేపటికల్లా దుకాణాలు ప్రారంభించాలంటున్న ప్రభుత్వం
- పేరుకే ఆన్‌లైన్ దరఖాస్తులు, సొంత మనుషులకే మద్యం దుకాణాల పందేరానికి ఏర్పాట్లు



దరఖాస్తుల అంచనా **5130**

వచ్చిన దరఖాస్తులు **3466**

దరఖాస్తుల ఆదాయం అంచనా **రూ.105 కోట్లు**

వచ్చిన ఆదాయం **రూ.69.32 కోట్లు**

ఒంగోలు టౌన్:

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ మేరకు జేబులో రూ.2 లక్షలు ఉన్న వారెవరైనా సరే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చంటూ హంగామా చేసింది. గత ప్రభుత్వం దశలవారీగా మద్య నిషేధం అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రైవేటు మద్యం దుకాణాల స్థానంలో ప్రభుత్వ దుకాణాలు ఏర్పాటు చేస్తే తెలుగు దేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. మద్య నిషేధాన్ని పూర్తిగా నీరుగారుస్తూ దరఖాస్తుల దగ్గర నుంచే వందల కోట్ల రూపాయలకు టెండర్ వేసింది. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు నిరుపేద, మధ్య తరగతి ప్రజల కాపురాల్లో చిచ్చుపెట్టే మద్యం విక్రయాల ద్వారా సంపద సృష్టించే పనికి పూనుకుంది. రోజంతా కష్టపడి సంపాదించిన కూలీ డబ్బులకు టెండర్ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

ఇక ఊరూ వాడా మద్యం పరవళ్లు

ప్రైవేటు మద్యం దుకాణాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏకబికిన పన్నెండు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో 171 దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు సన్నాహాలు చేశారు. మార్కాపురం, ఒంగోలు ప్రాంతాలను రెండు డివిజన్లుగా చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో 20 మద్యం దుకాణాలు, రూరల్ పరిధిలో 14 మద్యం దుకాణాలు కలుపుకొని ఒక్క ఒంగోలులోనే 34 దుకాణాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. చీమకుర్తిలో గ్రానైట్ కంపెనీలను దృష్టిలో ఉంచుకొని 16 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఒంగోలు డివిజన్లో 103 దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని చెప్పిన కూటమి పాలకులు జిల్లా సంగతి ఏమో కానీ మద్యం వ్యాపారానికి మాత్రం ప్రధాన కేంద్రంగా మార్చేశారని పశ్చిమ ప్రకాశం ప్రజలు విమర్శిస్తున్నారు. ఒక్క మార్కాపురం డివిజన్లో 68 మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

దరఖాస్తుల వివరాలు ఇలా...

జిల్లాలో మొత్తం 3466 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు నగరం, రూరల్ కలుపుకొని 34 దుకాణాలు ఉండగా 607 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల్లో జిల్లాలో ఒంగోలు అగ్రస్థానంలో నిలిచింది. 232 దరఖాస్తులతో గిద్దలూరు చివరి స్థానంలో ఉంది. తరువాత 391 దరఖాస్తులతో కనిగిరి ద్వితీయ స్థానంలో నిలిచింది. 386 దరఖాస్తులతో సింగరాయకొండ మూడో స్థానంలో ఉంది. 382 దరఖాస్తులతో దర్శి, 353 దరఖాస్తులతో చీమకుర్తి, 323 దరఖాస్తులతో మార్కాపురం ఆ తరువాత స్థానాల్లో ఉన్నాయి. పొదిలి 297, యర్రగొండపాలెం 255 కంభం 240 దరఖాస్తులు వచ్చాయి.

మంత్రి స్వామి నియోజకవర్గం కొండపిలోని 58వ నంబర్ దుకాణానికి జిల్లాలో అత్యధికంగా 46 దరఖాస్తులు వచ్చాయి. 59 దుకాణానికి 42, 57 దుకాణానికి 41 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా కనిగిరి రూరల్‌లో 125వ నంబర్ దుకాణానికి కేవలం 10 దరఖాస్తులు వచ్చాయి. అక్కడే 123, 124 దుకాణాలకు కూడా 12 చొప్పున దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అదేవిధంగా పొదిలి రూరల్, దర్శి రూరల్, హనుమంతునిపాడుల్లో దుకాణాలకు 11 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

నేడు అంబేద్కర్ భవనంలో డ్రా..

సోమవారం జిల్లా కేంద్రమైన ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో డ్రా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. తద్వారా మద్యం దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు మంజూరు చేస్తారు. ఇందుకోసం చేసిన ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. అంబేద్కర్ భవనంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. ఈ కౌంటర్లలో ఒకదాన్ని కలెక్టర్, మరో కౌంటర్‌ను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించనున్నారు. దరఖాస్తుదారులు ఉదయం 7.30 గంటలకల్లా చేరుకుంటే సరిగ్గా 8 గంటలకు తొలి డ్రా తీయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజా మోహిద్దీన్ తెలిపారు. డ్రా పూర్తయిన వెంటనే వారికి సాయంత్రం లోపు దుకాణాలు కేటాయిస్తూ లైసెన్సులు కూడా మంజూరు చేయనున్నారు. మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు కాగానే మరుసటి రోజు నుంచే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చెబుతోంది. ఇందు కోసం వ్యాపారులు ఇప్పటికే ఆయా కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో దుకాణాలు అద్దెకు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

12 రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ తతంగం...

ప్రైవేటు మద్యం దుకాణాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా పన్నెండు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించారు. ఒక్కో దుకాణానికి 30 దరఖాస్తుల లెక్కన మొత్తం 5130 దరఖాస్తులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ప్రభుత్వం ఊహించినంతగా దరఖాస్తులు రాలేదు. సగానికి సగం దరఖాస్తులు కూడా రాకపోయేసరికి ఎక్సైజ్ ఉద్యోగులను రంగంలోకి దించింది. బుజ్జగించి, బామాలి చివరి నిముషం వరకు చెమటోడ్చి పాత వ్యాపారులు, పార్టీ శ్రేణుల చేత కూడా దరఖాస్తులు చేయించింది. అయినా ప్రభుత్వం టార్గెట్‌లో 70 శాతం అంటే 3466 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఒక్కో దుకాణానికి 30 దరఖాస్తులు ఆశించగా 20.27 శాతం దరఖాస్తులు వచ్చినట్లు అధికారులే స్వయంగా వెల్లడించడం గమనార్హం. దరఖాస్తుల ద్వారా జిల్లాలో రూ.105 కోట్ల ఆదాయం వస్తుందని వేసుకున్న అంచనాలు సైతం తలకిందులయ్యాయి. కేవలం రూ.69.32 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది.

తీర ప్రాంత మండలాలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు చేసిన అధికారులు

ఒంగోలు సిటీ: దక్షిణ కోస్తా ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై తీరప్రాంత మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయడానికి కలెక్టర్ కార్యాలయంలో 1077 టోల్ ఫ్రీ నంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమును అధికారులు ఏర్పాటు చేశారన్నారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, రోడ్లు భవనాలు, విద్యుత్, వైద్యశాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఈ కంట్రోల్ రూములో నిరంతరం విధులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీప్రసన్న, జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆదివారం కొత్తపట్నం మండలంలో పర్యటించారు. మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి క్షేత్ర స్థాయి పరిస్థితిపై ఆరా తీశారు. తుఫాన్ షెల్టర్ కేంద్రాల నిర్వహణ, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళలు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు వృద్ధులపై ప్రత్యేక దృష్టి, అవసరమైన మందులను అందుబాటులో పెట్టుకోవడం, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.

చిరుద్యోగులపై కూటమి వేటు

తాము అధికారంలోకి వస్తే లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిన కూటమి నేతలు ఆ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే చిరుద్యోగులను తొలగించేస్తుండటంతో వారు రోడ్డున పడుతున్నారు. నూతన మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్న నేపథ్యంలో అక్కడ ఇప్పటి వరకు పనిచేస్తున్న చిరుద్యోగులు ఉపాధి కోల్పోనున్నారు. ఇంటర్వ్యూల ద్వారా మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- రోడ్డున పడుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న చిరుద్యోగులు
- కూటమి ప్రభుత్వం రాకతో మద్యం దుకాణాలు ప్రైవేటు పరం
- ఈనెల 16న మూత పడనున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు
- జిల్లాలో 171 మంది ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- తమకు న్యాయం చేయాలంటూ వేడుకోలు



మంగళగిరి ఎక్సైజ్‌శాఖ కమిషనర్ కార్యాలయం బయట సిబ్బంది పడిగాపులు (ఫైల్)



కంభం లో ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు (ఫైల్)

కంభం: ఏపీఎస్‌బీసీఎల్‌లో ఐదేళ్లుగా సూపర్‌వైజర్లుగా, సేల్స్‌మెన్‌లుగా ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న చిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం రావడంతో రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంటర్, డిగ్రీలు చదివి ఏ ఉద్యోగాలు రాక అల్లాడుతున్న సమయంలో గత ప్రభుత్వంలో 3600 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్‌బీసీఎల్ ద్వారా ఉన్నతాధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా ఉద్యోగాల్లో ఎంపిక చేశారు. తొలుత సూపర్ వైజర్లకు రూ.18 వేలు, సేల్స్‌మెన్‌లకు రూ.15 వేలు, వాచ్‌మెన్‌లకు రూ.9500 జీతం ఉండగా రెండేళ్ల తర్వాత సూపర్‌వైజర్లకు రూ.21,500, సేల్స్‌మెన్‌లకు రూ.18,500, వాచ్‌మెన్‌లకు రూ.10,500 గా జీతాలు పెంచారు. దీంతో తమ కుటుంబాలను పోషించుకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం దుకాణాలను ప్రైవేటుపరం చేసింది. దీంతో ప్రైవేటు వ్యక్తులు షాపులను సొంతం చేసుకోనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది ఉద్యోగులు, జిల్లాలో 171 మంది ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిపోయింది. సెప్టెంబరు 30వ తేదీతో సిబ్బంది కాంట్రాక్ట్ గడువు అయిపోయినా ఎక్సైజ్ అధికారులు సిబ్బందికి మాయమాటలు చెబుతూ అనధికారికంగా వారితోనే పనిచేయించుకుంటూ కాలయాపన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కానుండటం ఇంతవరకు అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతకు సంబంధించి ప్రభుత్వం నుంచి కానీ, ఉన్నతాధికారుల ద్వారా కానీ ఎటువంటి హామీలు అందకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులను కలిసిన సమయంలో ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సిబ్బందికి అనుభవ ధ్రువీకరణ పత్రం ఇస్తాం, స్కిల్ డెవలప్‌మెంట్‌కు అనుసంధానం చేసి జాబ్ మేళాల ద్వారా ఉద్యోగవకాశాలు కల్పిస్తాం, అర్హత ఉన్నవారికి ప్రభుత్వ పథకాల్లో వెసులుబాటు కల్పిస్తామంటూ చెప్పి తమను మభ్యపెట్టిస్తున్నారని వాపోతున్నారు.

సిబ్బంది డిమాండ్‌లు ఇవీ..

- ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలి.
- విద్యార్హతను, సీనియారిటీని బట్టి తమకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కార్యాలయాల్లో, కార్పొరేషన్లలో ఉద్యోగావకాశాలు కల్పించాలి
- వయస్సు రీత్యా కొంతమందికి ఉపాధి లేకుండా పోతుంది అటువంటివారు ఇతర ఉద్యోగాలకు వెళ్లలేని పరిస్థితి. వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

రోడ్డున పడతాం



స్థానికంగా ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా ఉద్యోగం చేసుకుంటూ మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాను. ఇప్పుడు ప్రైవేటు షాపులు రావడంతో రోడ్డున పడాల్సి వస్తుంది. ఉద్యోగాలు కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం ఇతర శాఖల్లో ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాలి.

– కొత్తపల్లి కుమార్‌బాబు, సేల్స్‌మెన్, తురిమెళ్ల, కంభం మండలం

స్పష్టమైన హామీ ఎవరూ ఇవ్వడంలేదు



ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఇప్పటికే ఎక్సైజ్‌శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీని, చీఫ్‌సెక్రటరీని, మంత్రులు నారా లోకేష్, కొల్లురవీంద్ర, పవన్‌కళ్యాణ్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలువురు శాసనసభ్యులను కలసి వినతి పత్రాలు అందించాం. వారి నుంచి సరైన హామీ లభించడం లేదు. మూడు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడుతున్న నేపథ్యంలో సిబ్బందికి న్యాయం చేయాలి.

– నందిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మార్కాపురం డిపో యూనియన్ నాయకుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాను. ఏదో ఒక ఉద్యోగం దొరికిందిలే కుటుంబ పోషణ సాగుతుందని అనుకున్న తమకు ఇప్పుడు ప్రైవేటు షాపులు రావడంతో ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తోంది. ఇప్పుడు వెళ్లి వేరే ఉద్యోగాలు వెతుక్కోవాలన్నా దొరికే పరిస్థితులు లేవు. ప్రభుత్వం తమకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలి.

– విలియమ్ కేరీ, సూపర్‌వైజర్, యరగొండపాలెం

క్లుప్తంగా

నేడు గ్రీవెన్స్ సెల్ రద్దు

ఒంగోలు అర్బన్: ఈ నెల 14వ తేది మద్యం షాపుల కేటాయింపు నేపథ్యంలో లాటరీ ప్రక్రియ ఉండటంతో నేడు జరగాల్సిన కలెక్టర్ గ్రీవెన్స్ రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. మద్య షాపుల కేటాయింపు లాటరీ ప్రక్రియలో కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొనాల్సి ఉన్నందున మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించి దూర ప్రాంతాల నుంచి కలెక్టర్ గ్రీవెన్స్‌కు రావద్దని కోరారు.

అమ్మవారికి సారె సమర్పించిన ముస్లింలు



సారె అందజేస్తున్న ముస్లిం నాయకులు

గిద్దలూరు రూరల్: దసరా మహోత్సవం సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఆలయ కమిటీ నిర్వాహకులకు ముస్లింలు శనివారం సారె అందజేశారు. మతసామరస్యం చాటి చెప్పేలా ముస్లిం మత పెద్దలు కలిసి అమ్మవారికి పసుపు కుంకుమ, చీర, పూలు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు నాయబ్‌రసూల్, ఈఓ శ్రీనివాసరావు, కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, ఆలయ కమిటీ నిర్వాహకులు దమ్మాల జనార్దన్, సురేంద్రకుమార్, పర్చూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ ఆత్మహత్యాయత్నం



గొంతు కోసుకున్న శివమహేష్

సింగరాయకొండ: మద్యం మత్తులో రౌడీషీటర్ తన్నీరు శివమహేష్ బ్లేడుతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో స్థానిక డ్రైవర్‌పేట 4వ లైన్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..రౌడీషీటర్ శివమహేష్ బేల్దారి పనిచేస్తుంటాడు. ఇతనిపై గతంలో బాలికపై లైంగిక దాడి, చోరీ కేసు ఉన్నాయి. లైంగిక దాడి కేసులో శివ మహేష్‌కు జైలు శిక్ష పడగా సుమారు ఏడాదిన్నర పాటు బెయిల్ ఇచ్చే వారు లేక జైలు జీవితం గడిపాడు. శుక్రవారం తన స్నేహితునితో కలిసి ఇంటి వద్ద మద్యం తాగిన తరువాత మానసిక వేదనలో బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కానీ తరువాత అతనే స్వయంగా 100కు ఫోన్ చేసి తనను కాపాడాలని వేడుకున్నాడు. ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించి వెంటనే 108 కు ఫోన్ చేశాడు. అప్పటికే శివమహేష్ గొంతు నుంచి రక్తం కారుతూనే ఉంది. దీనికి తోడు 108 రావటం ఆలస్యం కావటంతో ముందు జాగ్రత్తగా ఆటోలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకుని వెళ్లి ప్రథమచికిత్స చేయించారు. తరువాత 108లో కందుకూరు ఏరియా ఆస్పత్రికి పంపించగా వారు అతన్ని చేర్చుకోకుండా ఒంగోలు జీజీహెచ్‌కు పంపించారు. ప్రస్తుతం అతనికి ప్రాణాపాయం తప్పిందని, సకాలంలో ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాపాయం లేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ఆదివాసీల హక్కుల గొంతై నిలిచిన సాయిబాబా



ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం తెలుపుతున్న వామపక్ష, ప్రజాతంత్ర సంఘాలు

ఒంగోలు టౌన్: ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ అట్టడుగు ఆదివాసీ ప్రజల హక్కుల కోసం గొంతెత్తి నినదించిన అలుపెరుగని పోరాట యోధుడు సాయిబాబా మరణం దేశంలోని పీడిత ప్రజలందరికీ తీరనిలోటని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న 'మంచి పుస్తకం' వద్ద ఆదివారం ప్రొఫెసర్ సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొంభై శాతం అంగవైకల్యం కలిగిన సాయిబాబాపై అక్రమ కేసులు బనాయించి తొమ్మిదేళ్ల పాటు జైలులో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేయడం, ఆయన తల్లి మరణించినప్పుడు కూడా చివరిచూపునకు నోచుకోకుండా వేధించడం ద్వారా పాలకులు అమానవీయంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ వర్గాల ప్రజలు, ప్రజా స్వామికవాదులు మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను తిప్పికొట్టడమే సాయిబాబాకు నిజమైన నివాళి అవుతుందని సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు చెప్పారు. రాజ్యం పెట్టిన చిత్రహింసల ఫలితంగానే సాయిబాబా మృతి చెందారని చెప్పారు. ఈ సంతాప సభలో వామపక్ష, ప్రజాతంత్ర నాయకులు భీమవరపు సుబ్బారావు, అంకయ్య, నరసింహారావు, పినికి శ్రీనివాస్, ఎం జార్జీ, దాసరి సుందరం, ఆవుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉచితం మాటున ఊదేస్తున్నారు..!

టీడీపీ నేతలకు ఇసుక కాసులు కురిపిస్తోంది. ఓ పక్క ప్రభుత్వం ఇసుక ఉచితమని ప్రగల్భాలు పలకడమే గానీ..ఆ పార్టీ నేతలు అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ఇసుకను తమకు ఆదాయ వనరుగా మార్చుకొని లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ నేతల బరితెగింపుతో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా సాగుతున్న ఈ ఇసుక దందాలో రోజుకు లక్షల్లో చేతులు మారుతున్నాయి. సామాన్యుడికి ట్రక్కు ఇసుక దొరకడం కష్టంగా మారితే..టీడీపీ నేతలు మాత్రం ఉచిత ఇసుక మాటున వాగులు, వంకలను ఊదేస్తున్నారు.

- పాలేరు నుంచి రోజూ అక్రమంగా ఇసుక తరలింపు
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా దోపిడీ
- ట్రాక్టర్ రూ. 4 నుంచి రూ.6 వేలు చొప్పున విక్రయం
- లక్షలు సొమ్ము చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- సామాన్యుడికి అందని ఉచిత ఇసుక
- చోద్యం చూస్తున్న అధికారులు



పగలే పాలేరు నది నుంచి ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు

పొన్నలూరు:

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా మండల పరిధిలోని పాలేరు నుంచి నిత్యం ఇసుకను తరలిస్తూ తెలుగు తమ్ముళ్లు లక్షల రూపాయిలను సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలోకి తీసుకువచ్చినా మండల ప్రజలకు అందుబాటులో అధికారకంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయలేదు. పాలేరు నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉన్నా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. పొన్నలూరు మండలంలోని పాలేరు నదికి సమీపంలో చెన్నిపాడు, పరుచూరివారిపాలెం, బాలిరెడ్డిపాలెం, కొత్తపాలెం, ఉప్పలదిన్నె, రావులకొల్లు, ముప్పాళ్ల, వేంపాడు గ్రామాలు ఉన్నాయి. వీటిలో ఉప్పలదిన్నె, బాలిరెడ్డిపాలెం, రావులకొల్లు, ముప్పాళ్ల, వేంపాడు గ్రామాల సమీపంలో నాణ్యమైన ఇసుక దొరుకుతుంది. అయితే ఈ గ్రామాల సమీపంలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేయకపోవడంతో కొందరు అక్రమార్కులతో పాటు అధికార పార్టీ నాయకులు అక్రమ ఇసుక రవాణాకు తెరతీశారు. అనుమతులు లేకపోయినా పాలేరు పరీవాహక గ్రామాల నుంచి యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. అధికార బలంతో పగలు, రాత్రి లేడా లేకుండా చుట్టుపక్కల మండలాలకు రవాణా చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఈ తతంగం మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి కనుసన్నల్లో నడుస్తుండటంతో సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ అటు వైపుగా వెళ్లడం లేదు.

సామాన్యుడికి అందని ఇసుక...

పేరుకే ఇసుక ఉచితమైనా ప్రజలకు నాలుగు నెలలుగా ఇసుక కష్టాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. వేలకు వేలు వెచ్చించి రోజుల తరబడి ఎదురుచూస్తేగాని ఇసుక దొరకని పరిస్థితి ప్రసుత్తం నెలకొంది. ప్రభుత్వం ఉచిత ఇసుక అందజేస్తామని చెప్పి నగదు వసూలు చేయడంతో పాటు ఇసుక రీచ్‌లు అందుబాటులో లేకపోవడంతో పేద ప్రజలు దూర ప్రాంతాల రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చుకోవడానికి బాడుగ చెల్లించలేక ఆర్థికపరమైన అవస్థలు పడుతున్నారు. దీనిపై సామాన్యులతో పాటు టీడీపీ కార్యకర్తల నుంచి కూడా ప్రస్తుతం తీవ్ర వ్యతిరేకత వస్తుంది.

పగలు, రాత్రి ఇసుక రవాణా...

మండలంలో ఇసుక రీచ్ లేకపోవడంతో కొందరు అధికార బలం ఉపయోగించి పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. కనిగిరి, మర్రిపూడి, కొండపి, జరుగుమల్లి, దర్శి, కందుకూరు, పొదిలి ప్రాంతాలకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, మినీ లారీలు ద్వారా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ఇసుక డిమాండ్‌ను బట్టి ట్రక్కు ఇసుక రూ.4 వేలు నుంచి రూ. 6 వేలు వరకు, మినీ లారీ రూ. 10 నుంచి 20 వేల వర కు అమ్ముకుంటూ లక్షలు అర్జిస్తున్నారు. మరి కొందరు దర్జాగా పాలేరులోనే ఇసుకను జల్లెడ పట్టి ట్రాక్టర్లతో తీసుకుపోతున్నారు. అనధికార ఇసుక రీచ్‌ల నుంచి అనుమతులు లేకపోయినా మండలంలో పాలేరు నది నుంచి దర్జాగా ఇసుకను రవాణా చేస్తున్నారు. కొన్ని గ్రామాల ప్రజలు అప్పుడప్పుడు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటున్నా అధికారపార్టీ నాయకులు సహకారంతో వారిని బెదిరించి తమ తంతును కొనసాగిస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు...

పాలేరు పరివాహక గ్రామాల ప్రజలకు అధికారులు పాలేరు నుంచి రక్షిత మంచినీటి పథకాల బావులను నిర్మించి తాగు, వాడుక నీటిని అందిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అక్రమార్కులు ఈ స్కీం బావులకు సమీపంలో ఇసుకను తొడటం వలన భూగర్భ జలాలు ఎండిపోయి రక్షిత మంచినీటి పథకాల బావుల్లో నీళ్లు ఉండటం లేదు. ఇసుక అక్రమార్కుల చర్యలతో పాలేరు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తోడేస్తుండటంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై పలు గ్రామాల ప్రజలు అధికారులకు పిర్యాదు చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు వీఆర్‌ఏలను కాపలాగా కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసినా అధికార పార్టీ నాయకులు వారిని బెదిరించి ఇసుకను తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న అనాధికార ఇసుక రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వేంపాడులో స్కీం బావులకు సమీపంలో ఇసుకను తోడటంతో ఏర్పడిన గుంతలు

ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీలలో తలపడుతున్న బాలికలు

ఒంగోలు: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో జరిగిన పోటీలకు ఒంగోలు రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ కోచూరి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల ముగింపు అనంతరం ప్రతి విభాగంలో మెరుగైన ర్యాంకింగ్ స్థానాన్ని కైవసం చేసుకున్న ఇద్దరికి ప్రశంసా పత్రాలు, ట్రోఫీలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెరుగైన ర్యాంకింగ్ దక్కించుకోవాలంటే అందుకు పోటీతత్వం ముఖ్యమన్నారు. పోటీతత్వం అలవడితే ఏ రంగంలో అయినా విజయాన్ని సాధించడం సులభమన్నారు. టేబుల్ టెన్నిస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శి విజయ్ ప్రకాష్, విశ్వనాథ్‌లు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ ఒక మంచి ఉత్సాహవంతమైన ఆట అని, దీని ద్వారా ప్రతి ఒక్కరు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉత్సాహాన్ని పొందగలుగుతారన్నారు. ప్రపంచ స్థాయి ఆట అని, ఇందులో రాణించడం ద్వారా ప్రపంచ ఖ్యాతిని ఆర్జించవచ్చన్నారు. జిల్లా చైర్మన్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.కిషోర్‌కుమార్, పి. ప్రియ మాట్లాడుతూ ఏకాగ్రత ద్వారా టేబుల్ టెన్నిస్‌లో పట్టు సాధించడం సాధ్యపడుతుందన్నారు. ఇందుకు నిత్యం సాధన అవసరమని సూచించారు.

విజేతల వివరాలు (మొదటి, రెండు స్థానాలలో నిలిచిన వారు)


అండర్ 11 బాలికలు: వి.పూజిత, ఎస్.మనస్వి
అండర్ 11 బాలురు: యశ్వంత్‌కుమార్, తరుణ్‌తేజ
అండర్ 13 బాలికలు: ఆరిఫ్ సుల్తానా, ఈషా సంజన
అండర్ 13 బాలురు: ఎస్.దేవాన్ష్, హార్దిక్ రామ్ వారణాశి
అండర్ 15 బాలికలు: శాంతి జ్యోతి, దీక్షిత
అండర్ 15 బాలురు: చేతన్ సాయి, టీఎస్ఎస్ విఖ్యాత్
అండర్ 17 బాలికలు: మౌపర్ణదాస్, హాసిని పాపసాని
అండర్ 17 బాలురు: సుభాశంకర్ దీక్షిత్, సీహెచ్ విద్యాసాగర్
అండర్ 19 బాలికలు: వైష్ణవి సూర్య, హాసిని పాపసాని
అండర్ 19 బాలురు: ప్రగ్యాన్, వెంకట మణికుమార్ పొన్నూరు
మహిళా విభాగం: పి.చార్వి, కాజల సునార్ రామ్‌జలి
పురుషులు: వెంకట మణికుమార్ పొన్నూరు, కౌషల్ దాస్

భార్యతో గొడవపడి..రైలు పట్టాలెక్కాడు

- కుటుంబసభ్యుల సమాచారంతో కాపాడిన పోలీసులు

ఒంగోలు టౌన్: భార్యతో గొడవపడి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని వెళ్లిన వ్యక్తిని కుటుంబసభ్యుల సమాచారంతో పోలీసులు రక్షించారు. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..నగరంలోని దేవుడుచెరువుకు చెందిన రమేష్‌కు అతని భార్యకు మధ్య శనివారం రాత్రి గొడవ జరిగింది. మాటామాటా పెరిగి ఇద్దరూ వాదులాడుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన రమేష్ ఒంగోలు రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. తాను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోతున్నానని తన సోదరికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆమె వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే స్పందించిన సీఐ మేడా శ్రీనివాసరావు ఐటీ కోర్ టీం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రమేష్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. ఒంగోలు రామ్‌నగర్ 11వ లైను రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నట్లు పసిగట్టారు. వెంటనే సిబ్బందితో అక్కడకు చేరుకొని అతడిని రక్షించారు. ఆత్మహత్యకు పాల్పడకుండా రమేష్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాసరావు, రక్షక మొబైల్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుల్ కిషోర్, ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

ఉర్దూ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఉర్దూ సంఘం నాయకులు

మార్కాపురం: రాష్ట్రంలో ఉర్దూ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) జిల్లా అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. మార్కాపురం 2వ వార్డులోని మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జిల్లా ఉర్దూ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అన్వర్ బాషా విలేకరులకు తెలిపారు. సర్వీసు, అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉర్దూ టీచర్లకు ప్రమోషన్లు కల్పించాలని, అన్నీ క్యాటగిరీల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను డిసెంబరులో ఇచ్చే డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపించి భర్తీ చేయాలని కోరారు. ఉర్దూ మాట్లాడే వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉర్దూ పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం సకాలంలో అందించాలని, జిల్లాలోని ప్రతి హైస్కూల్‌లో 20 మంది ముస్లిం విద్యార్థులు ఉన్నచోట ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ టీచరు పోస్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సయ్యద్ సమీవుల్లాబాషా, పఠాన్ హిదయతుల్లాఖాన్, షేక్ బురానీపీరా, హకీంఖాన్, ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు పీ అబ్దుల్ వహీద్‌ఖాన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి



వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శిస్తున్న బొట్ల రామారావు, ఇతర నేతలు

టంగుటూరు: దసరా పండుగను పురస్కరించుకొని అమ్మవారి ఊరేగింపు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఈ ఘటన మండలంలోని కారుమంచి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏటా దసరా పండుగను పురస్కరించుకొని 9 రోజుల పాటు పూజలు నిర్వహించి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తారు. అయితే ఈ ఏటా టీడీపీ నాయకులు గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్దేశపూర్వకంగా టీడీపీ నాయకులపై దాడి చేశారు. ఊరేగింపు జరుగుతున్న సమయంలో కరెంట్ కట్ చేసి మరీ వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ సింగయ్య, నీరుకొండ తిరుమలరావుపై దాడి చేశారు. అయితే ఇదంతా పోలీసులు ముందే జరుగుతున్నా వారు ప్రేక్షకపాత్ర పోషించడమే కాకుండా వైఎస్సార్ సీపీ నేతలపై దౌర్జన్యం చేసి ఇంటికి పంపించారు. వైఎస్సార్ సీపీ నేతలు ఇంటికి వెళ్లినా టీడీపీ నాయకులు అక్కడకు వెళ్లి ఇంటి ముందు హడావుడి చేశారు. వీరిని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జోన్–5 ఇన్‌చార్జి బొట్ల రామారావు, మల్లవరపు రమణారెడ్డి, పలువురు నాయకులు పరామర్శించారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై కేసు నమోదు

ఊరేగింపు సందర్భంగా టీడీపీ నాయకులు దాడి చేస్తే..పోలీసులు మాత్రం వైఎస్సార్ సీపీ నేతలపై కేసు పెట్టడం విశేషం. అమ్మవారి ఊరేగింపు సమయంలో డాలు యశ్వంత్‌ను బత్తుల శ్రీను, మరికొంత మంది వ్యక్తులు కొత్తితో దాడి చేశారని, వల్లూరు రాజును కత్తితో పొడిచారని, వంశీని కర్రలతో కొట్టినట్లు ఆస్పత్రిలో చేరి యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాయు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటనాయుడు

కొత్తపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకావం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి కొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిస్తే ఏ విధంగా ఎదుర్కోవాలో సూచించారు. గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మండలంలో 11 తుఫాన్ షెల్టర్లు ఉన్నాయని, వాటిల్లో నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే ఇబ్బంది లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులు, రోగాలతో బాధపడే వారి జాబితా సేకరించి తహసీల్దార్‌కు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పూరిళ్లు, మట్టి ఇళ్లు శిథిలావస్థలో ఉంటే వాటిలో నివసించే వారి వివరాలను తహసీల్దార్‌కు ఇవ్వాలన్నారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించడానికి అవసరమయ్యే టార్చ్‌లైట్, కొవ్వొత్తులు, తాగునీరు, చిన్న పిల్లలకు అవసరమయ్యే పాలు, నిత్యావసరాలు సిద్ధంగా ఉంచుకునేలా ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆర్డీఓ కె.లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీఓ కృష్ణ, తహసీల్దార్ మధుసూధన్‌రావు, విస్తరణాధికారి మూర్తి, శానిటేషన్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

20 అడుగులు ముందుకు వచ్చిన తీరం



పాకల బీచ్‌లో ముందుకు వచ్చిన సముద్రం

సింగరాయకొండ: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం పాకల బీచ్‌లో సముద్రం సుమారు 20 అడుగులు ముందుకు వచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు. పాకల బీచ్‌ను మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖాధికారి చంద్రశేఖరరెడ్డి పరిశీలించి మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. తీరం వెంబడి బోట్లను దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, సముద్రంలో లంగరు వేసిన బోట్లను తీరానికి తీసుకుని రావాలన్నారు. అల్పపీడనం కారణంగా తీరంలో అలల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. ఈ సందర్భంగా తీరంలో వేటాడుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు బోట్లను అరికట్టాలని మత్స్యకారుడు గొల్లపోతు సురేష్ మత్స్యశాఖాధికారి చంద్రశేఖరరెడ్డిని కోరారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

- కేసు నమోదు..పరారీలో నిందితుడు

మద్దిపాడు: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. పందిళ్లపల్లి నుంచి వచ్చిన యడవల్లి హనుమంతరావు అనే వ్యక్తి కొష్టాల సెంటర్‌లో నివాసం ఉంటున్నాడు. పామూరుకు చెందిన కుటుంబం కూడా కొష్టాల సెంటర్‌కు పనుల నిమిత్తం వచ్చి అక్కడే నివాసం ఉంటుంది. ఈ క్రమంలో బాలిక తల్లి సుత్తి తీసుకురమ్మని పంపించగా..హనుమంతరావు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ బాలిక నొప్పి తట్టుకోలేక విషయం తల్లికి చెప్పడంతో వారు మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఎస్సై హనుమంతరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.